


నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

నూతన సంవత్సర శుభాకాంక్షలు



చిలకలూరిపేట: నియోజకవర్గ ప్రజలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త అలోచనలు, మంచి నిర్ణయాలతో నూతన సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచి బాటలో, చెడుకు దూరంగా అభివృద్ధి పథంలో కొనసాగాలని ఆకాంక్షించారు.

డాక్టర్ గోపిరెడ్డి...



నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు మంగళవారం తెలియచేశారు. ఏడాది పాటు ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కాగా, ప్రజలకు గుంటూరురోడ్డులోని కార్యాలయంలో నిర్వహించే వేడుకల్లో అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

విద్యుత్ సంస్థల నాశనానికి పూనుకున్న చంద్రబాబు

- స్మార్టు మీటర్ల ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలి
- కార్యాలయం ఎదుట ఆందోళన చేసిన సీఐటీయూ నాయకులు



విద్యుత్ ఇఇ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో విద్యుత్ సంస్థలను నాశనం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మొదటి స్థానంలో ఉన్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ పేర్కొన్నారు. చండీఘర్ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ పంపిణీ వ్యవస్థను ప్రైవేటు పరం చేస్తూ విడుదల చేసిన జీవోకు వ్యతిరేకంగా మంగళవారం స్థానికి సీఐటీయూ నాయకులు విద్యుత్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ 2000ల ఏడాది నుంచే విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి నాణ్యమైన విద్యుత్ అందజేస్తానంటూ చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటి వరకు లేని కాంట్రాక్ట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టారన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపుతుందన్నారు. అదేమంటే గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అని చెబుతున్నారన్నారు. దీనిని వ్యతిరేకించిన ప్రజలు చంద్రబాబుకు అధికారం ఇచ్చారనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రవేశపెట్టి ప్రజలపై భారం తగ్గించాలే కాని విద్యుత్ భారం మోపటం సరైంది కాదన్నారు. అందువలన విద్యుత్ సంస్థలను కాపాడుకునేందుకు ఉద్యోగులు, కార్మికులు, రైతులు అందరూ కలిసిరావాలని కోరారు. కార్యక్రమంలో శిలార్ మసూద్, ఏవూరి గోపాలరావు, డి.శివకుమారి, చంద్రబోస్ పాల్గొన్నారు.

ఘనంగా గీతమ్స్‌లో నూతన సంవత్సర వేడుకలు


వేడుకల్లో గీతమ్స్ విద్యార్థులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సిద్ధార్థనగర్‌లోని గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాబోయే నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాలు నింపాలని సుఖసంతోషాలు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులు వేసిన న్యూఇయర్ రంగవల్లులు చూపరులను ఆకట్టుకున్నాయి. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. కృష్ణవేణి, డైరెక్టర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ

బొల్లాపల్లి : సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ మండలంలో 91.77 శాతం నమోదైందని ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య తెలిపారు. మండలంలోని 33 పంచాయతీల్లో 8745మంది పింఛన్ లబ్ధిదారులకు 8025మంది లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు నేడు పంపిణీ జరుగుతుందని చెప్పారు. వితంతు, వికలాంగు, ఒంటరి తదితర పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల ఒక రోజు ముందుగానే పంపిణీ జరిగిందని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి వాడండి


సీఎం చంద్రబాబుకు విరాళం అందజేస్తున్న మేఘన

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ ఆలయ అభివృద్ధికి యల్లమంద గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని మానుకొండ మేఘన రూ. 1,08,000లను అందజేశారు. మంగళవారం కోటప్పకొండ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ఈ విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా మేఘనతో చంద్రబాబు కొంతసేపు ముచ్చటించారు. కళాశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కోడెల శివరామ్, ఈవో చంద్రశేఖర్, విద్యార్థి తల్లిదండ్రులు మానుకొండ శివరామకృష్ణ పాల్గొన్నారు.

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో రవిచంద్ర

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన క్విజ్ పోటీలను నిర్వహించారు. సైన్స్, ఎగ్జిబిషన్ వ్యక్తిగత విభాగంలో సాయిసుమ (ఏపీ మోడల్ స్కూల్), గ్రూప్ విభాగంలో కేజీబీవీ విద్యార్థినులు, క్విజ్ పోటీల్లో బి.హరిబాబు (జడ్పీహెచ్ఎస్) విజేతలుగా నిలిచి జిల్లాస్థాయికి అర్హత పొందారని ఎంఈవో ఎన్. రవిచంద్ర తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం వీవీ శ్రీనివాస్, సైఎల్. అంజిరెడ్డి పాల్గొన్నారు.

మండలస్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్‌పోటీలు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఈమని కృష్ణారెడ్డి, హెచ్ఎం కృష్ణానాయక్ ప్రారంభించారు. మండల పరిధిలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటూ చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్ మూడు కేటగిరీల్లో నిర్వహించారు. టీచర్స్ విభాగంలో గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ) ఎస్ఎంఎల్ కాత్యాయని, గ్రూప్ విభాగంలో గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం.సాయి, కె.వంశీకృష్ణ విజయం సాధించారు. స్కూల్ అసిస్టెంట్ వై.శ్రీనివాసరావు గైడ్‌గా వ్యవహరించారు. ఇండివిడ్యువల్ విభాగంలో సాతులూరు జెడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థి పి.పూర్ణమనోహర్ ఎంపికయ్యాడు. సాతులూరు స్కూల్ అసిస్టెంట్ పీఎస్ పి.శ్రీనివాసరావు గైడ్‌గా వ్యవహరించారు.

క్విజ్ పోటీల్లో...

మండలస్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8,9,10 తరగతులు చదువుతున్న హిమాదిత్య, జగన్మోహన్ రెడ్డి, సాత్విక్ గెలుపొందారు. వీరు జనవరి4న జిల్లాస్థాయిలో నరసరావుపేటలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. అనంతరం పది పాఠశాలలకు చెందిన లైబ్రరీ బుక్స్ ప్రదర్శన నిర్వహించారు. మండల సైన్స్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు బాజీబాబు, కె.శ్రీనివాసరావు, రత్నరాజు, జి.శ్రీనివాసరావు, స్నేహలతారెడ్డి, శైలజ, దివ్యజ్యోతి, కె.కోటేశ్వరరావు, ఉషారాణి, పద్మావతి పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్ పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

చిలకలూరిపేట: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం 2025 నూతన సంవత్సర డైరీని సంఘ నాయకులతో కలసి ఎంఈవో కె లక్ష్మి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా అన్ని విషయాలు పొందుపరుస్తూ ఎస్టీయూ డైరీ ముద్రించటం అభినందనీయమన్నారు. సర్వీసు వివరాలు, పీఆర్‌సీ వివరాలు, డీఏ వంటి అంశాలు ప్రచురించటం ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, నాయకులు మేకల కోటేశ్వరావు, వడ్లాన జయప్రకాశ్ పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎంఈవో కె లక్ష్మి, ఎస్టీయూ నాయకులు

పరిపాలన అధికారి వాణి సేవలు అభినందనీయం

ఎంపీపీ సుహాసిని



వాణి దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ

శావల్యాపురం: అంకిత భావంతో విధులు నిర్వహించిన ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న కుదుముల వాణి వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 35 సంవత్సరాల పాటు పంచాయతీరాజ్ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందటం అభినందనీయమన్నారు. కేవలం శావల్యాపురం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల్లో సంవత్సరాల తరబడి విధులు నిర్వహించటం పనితీరుకు నిదర్శమన్నారు. అనంతరం వాణి దంపతులను పూలమాలలు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, మాజీ ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ముండ్లమూరి అనిల్‌కుమార్, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, కార్యాలయ సిబ్బంది, కుటుంబ సభ్యులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

వినుకొండ(నూజెండ్ల): పెరిగిన విద్యుత్‌చార్జీలకు వ్యతిరేకంగా వినుకొండ మండలంలోని భారతాపురం గ్రామంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఆర్. ముని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని బ్రహ్మం గారి గుడి వద్ద గ్రామస్తులతో కలిసి విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఈ సందర్భంగా సీపీఎం వినుకొండ కమిటీ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా రాబోయే కాలంలో విద్యుత్ చార్జీలను పెంచబోమని నమ్మబలికారని, అధికారం చేపట్టగానే విద్యుత్ చార్జీలను ఇంధనపు సర్‌చార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్. సురేష్‌రాజా, ఎం.సత్యనారాయణ, పార్టీ నాయకులు కె.శివ రామకృష్ణ, పి.వెంకటప్పయ్య, ఎస్‌కే నాసర్‌బీ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న గ్రామస్తులు, నాయకులు

వైభవంగా ధనుర్మాస పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీవారి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని వడవల్లి రామాలయం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం శ్రీవారికి స్వర్ణకవచ అలంకరణ చేపట్టారు. రైల్వేస్టేషన్‌రోడ్ లోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి దివ్య మంగళ స్వరూప అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై శ్రీవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.


వడ్డవల్లిలో స్వర్ణకవచ అలంకరణలో శ్రీవారు



మొక్కజొన్నలో బొగ్గుమచ్చ తెగులు

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, పరగటిచర్ల గ్రామాల్లో సాగుచేస్తున్న మొక్కజొన్న పంటను అక్కడక్కడ బొగ్గు మచ్చ తెగులు కనిపిస్తుందని వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మొక్కజొన్న పైరును ఆమె పరిశీలించారు. ఈ తెగులు మొక్కల మొదలు భాగంలో సోకుతుందన్నారు. కాటుక రంగులో నల్లని మచ్చలు ఏర్పడతాయన్నారు. ఆయా గ్రామాల వీఏఏలు, మొక్కజొన్న పంట సాగు చేస్తున్న రైతులు పాల్గొన్నారు.


తెగులు సోకిన మొక్కజొన్న ఆకులను పరిశీలిస్తున్న ఏవో, రైతులు

భూసార పరీక్షల ఆధారంగా సాగుతో మేలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో మంగళవారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులకు రైతులకు మట్టినమూనా పరీక్షలపై అవగాహన కల్పించారు. మట్టినమూనాలో పరీక్షల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. భూసార పరీక్షల ద్వారా కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం తదితరాల గురించి అవగాహన పెరుగుతుందని, తదనుగుణంగా పంటల సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.


సాతులూరులో భూసార పరీక్షల నమూనాల సేకరణలో విద్యార్థులు

మొక్కలు నాటి పరిరక్షించాలి

చిలకలూరిపేట: విద్యార్థులు మొక్కలు నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పురుషోత్తమపట్నం మున్సిపల్ యూపీ స్కూల్‌లో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒయాసిస్ సంస్థ మొక్కలు నాటే కార్యక్రమం ఒక యజ్ఞంగా చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ ప్రత్తిపాటి పుష్పల్లాదేవి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఒయాసిస్ సంస్థ సభ్యులు

గీతాంజలిలో నూతన సంవత్సర వేడుకలు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతాంజలి స్కూల్‌లో 2025 నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ టి. కృష్ణవేణి మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ విద్యార్థులు క్రొత్త సంవత్సరంలో మంచి అలవాటులను అలవర్చుకొని విద్యలో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం చిన్నారులు న్యూ ఇయర్ కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. చిన్నారులు వేసిన న్యూ ఇయర్ రంగవల్లులు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ముగిసిన జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలు


అండర్-17 బాలుర విభాగంలో విన్నర్ ట్రోఫీని అందుకుంటున్న బీహార్ జట్టు

నరసరావుపేటరూరల్: కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 28 నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించిన 18వ జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. నాలుగు విభాగాల్లో జరిగిన ఫైనల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-17 బాలుర విభాగంలో బీహార్ (ప్రథమ), చత్తీస్‌ఘడ్ (ద్వితీయ), తమిళనాడు (తృతీయ), అండర్-17 బాలికల విభాగంలో తమిళనాడు (ప్రథమ), కర్ణాటక (ద్వితీయ), హర్యానా(తృతీయ) స్థానాలు సాధించాయి. అండర్-12 బాలుర విభాగంలో తమిళనాడు (ప్రథమ), జమ్ము-కాశ్మీర్ (ద్వితీయ), ఆంధ్రప్రదేశ్ (తృతీయ), అండర్-12 బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ (ప్రథమ), కర్ణాటక (ద్వితీయ), తమిళనాడు (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కే-రిడ్జ్ స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ దీపేంద్ర ఆర్యలు పాల్గొని విజేతలకు ట్రోఫీలు అందజేశారు. పోటీల పరిశీలకుడు పంకజ్, ఏపీ ఫ్లోర్ బాల్ కార్యదర్శి కేజె జోసెఫ్, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజి పాల్గొన్నారు.















సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

AGRI LAND FOR SALE

■ 100 చ.గ.ల్లో 10 అ॥ ఎత్తుగల 10 ఎర్రచందనం మొక్కలతో 150000/-కే ప్రకాశం జిల్లా, అద్దంకి దగ్గర & పొదిలి దగ్గర్లో 22 సెంట్లు 96 ఎర్రచందనం మొక్కలతో 500000/-కే ☏ 81435 99969

FLAT FOR SALE

■ గుంటూరు రోడ్, మాచర్లలో 136 చ.గ.లలో నిర్మించిన 1500 చ.అ.ల డూప్లెక్స్ ఇండిపెండెంట్ విల్లాస్ అమ్మకమునకు కలవు. 100% వాస్తు మంచి నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం, రెడీ టూ ఆక్యుపై. 9704852952, 9866030052

■ గుంటూరు సిటీ గోరంట్ల యాదవుల డొంక సాయిసౌధ అపార్ట్మెంట్ రోడ్ డూప్లెక్స్, జి+1, న్యూ ఇండిపెండెంట్ హౌస్ 100% వాస్తు గ్రౌండ్ మునిసిపల్ వాటర్ బ్యాంకులోన్ 9848510021

PLOT FOR SALE

■ న్యూ ఇయర్, సంక్రాంతి ఆఫర్ చ.గ.7599/- లకే. 1ప్లాటు కొంటే 1ప్లాటు ఫ్రీ. సర్వ భూమి లాంటిది. చిలకలూరిపేట ఏరియా హౌసింగ్ ప్లాట్లు పెట్టుబడి పెట్టిన వారంత అదృష్టవంతులే. స్పాట్ రిజిస్ట్రేషన్. 9390037605

SERVICES

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ఫ్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8876001878, 96430 10487, 8376089771, 011-25820179

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ☏ 91689 22299

■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ☏ 83338 33368

WANTED

■ అంగడిపాలెం, పేరేచర్ల, గుంటూరు ఆటోనగర్ లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ అర్జంటుగా కావలెను. మంచి జీతం, అర్హత : 5th-ఇంటర్, సంప్ర॥ 7386585946, 7386748684

■ విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త. గుంటూరు నగరంలోని ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో కలిసి పనిచేయుటకు 10th పాస్, 50సం॥ పై వయస్సు వారు కావలెను. 9989909698

■ కావలెను: గుంటూరు సిటీ నగరంపాలెంలోని లాయరు గారి ఆఫీసు నందు ఇంగ్లీష్ టైప్ చేయు స్త్రీ/పు॥ ఆపరేటర్స్ కావలెను. ఇంటర్వ్యూ తేదీ: 5-1-25. ☏ 8686138833

■ Wanted B-Pharmacy or D-Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Certificate Registration Manadatory. Ph: 6300975241

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.